క్లుప్తంగా

7న మండల స్థాయి క్రీడా పోటీలు

కె.గంగవరం: ఈ నెల 7,8 తేదీల్లో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్టు ఎంఈఓ నాగరాజు శనివారం తెలిపారు. పామర్రు ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో 7న అండర్ 14, అండర్ 17 బాలికలు, 8న అండర్ 14,17 బాలుర పోటీలు జరుగుతాయన్నారు. వీరికి కబడ్డీ, వాలీబాల్, ఖో–ఖో, షటిల్, బ్యాడ్మింటన్, యోగ, చెస్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు దరఖాస్తు పూర్తి చేసి ఆధార్ జెరాక్స్‌తో హాజరుకావాలని ఆయన కోరారు.

హిందీ ఉపాధ్యాయిని రత్నకుమారికి సత్కారం



ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్లో రత్నకుమారిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్ హిందీ ఉపాధ్యాయిని డీవీ రత్నకుమారిని అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని రామచంద్రపురం పట్టణానికి చెందిన వాడ్రేవు సాయిప్రసాద్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం పాఠశాల ఆవరణలో ఘనంగా సత్కరించారు. ప్రధానోపాధ్యాయుడు పేరి రాజశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ జాతీయ భాష హిందీ బోధనలో ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు గ్రహీత రత్నకుమారి ఉన్నతమైన ప్రమాణాలు పాటించారని కొనియాడారు. ట్రస్ట్ ప్రతినిధి వాడ్రేవు రత్న పద్మావతి రత్నకుమారికి శాలువా కప్పి రూ. 5 వేలు నగదు, జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అరవ విస్సు, ఉమాపతి, ఆని శ్రీనివాస్, స్వామి, ఉమ, రాధ, భవాని పాల్గొన్నారు.

ధరలను నియంత్రించాలి

కాజులూరు: రోజురోజుకూ పెరిగిపోతున్న నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్ బిల్లులను ప్రభుత్వం నియంత్రించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజుబాబు అన్నారు. శనివారం కాజులూరులో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల ప్రకారం విద్యుత్ బిల్లులు తగ్గించాలని కోరారు. కూటమి ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్ బిల్లులను పెంచి పేదల బతుకులను భారంగా మార్చిందన్నారు. అవసరానికి ఎరువులు లభించక రైతులు నష్టపోతున్నారని అన్నారు. పాలకులు స్పందించి ఇప్పటికైనా పెరిగిన ధరలను నియంత్రించాలన్నారు. కార్యక్రమంలో కౌలురైతు సంఘాల నాయకులు నామ మాచర్రావు, కురుపూడి భూచక్రం, ఎం వెంకటరమణ పాల్గొన్నారు.

ఆకు ఎండు తెగులును నివారించాలి

రామచంద్రపురం రూరల్: వరి పైరుపై ఇటీవల కనిపిస్తున్న ఆకు ఎండు తెగులను ప్రాథమిక దశలోనే రైతులు గుర్తించి, నివారణ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి టీవీఆర్ మణిదీప్ సూచించారు. వెలంపాలెంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆకు ఎండు తెగులు వ్యాప్తి, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు ఆయన వివరించారు.

వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు

కపిలేశ్వరపురం: అంగరలోని శ్రీవైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం విశేష పూజలు చేశారు. ఆలయ అర్చక బృందం సభ్యులు స్వామిని పూలతో అలంకరించారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.

యువత కోసం మానవత సైకిల్ యాత్ర

రాయవరం: వ్యసనాలతో నాశనమైపోతున్న యువత పరివర్తనకు నాంది పలికేందుకు మానవత సైకిల్ యాత్రను రాయవరంలో శనివారం ప్రారంభించారు. స్థానిక రాయవరం ఎస్ఆర్ జెడ్పీ హైస్కూల్, విశ్వ మానవతా సంస్థ, ఇతర సేవ సంస్థలు, కళాశాలలు, పాఠశాలలు, విద్యార్థులు, స్వచ్ఛంద కార్యకర్తలు ఐక్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మానవత సైకిల్ యాత్ర ఉదయం 8 గంటలకు లొల్ల గ్రామం నుంచి, రాయవరం, మహేంద్రవాడ, పొలమూరు మీదుగా అర్తమూరు, తరువాత రామవరం, కుతుకులూరు చేరుకుంటుందన్నారు. మార్గం మధ్యలో పాఠశాలల, కళాశాలల విద్యార్థులకు స్ఫూర్తి సమావేశాలు, సందేశాలు ఇస్తూ ముందుకు సాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

సూపర్ జీఎస్టీపై అవగాహన కల్పించాలి

కపిలేశ్వరపురం (మండపేట): సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై ప్రభుత్వ సిబ్బందికి సరైన అవగాహన ఉండాలని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు పట్టణ సచివాలయం కార్యదర్శులకు సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కార్యదర్శులతో జీఎస్టీ శ్లాబుల సవరణ తదితర అంశాలపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. సూపర్ సేవింగ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని కమిషనర్ ఆదేశించారు.

పీఎం సూర్యఘర్‌తో సౌర వెలుగులు

- కేంద్ర ప్రభుత్వం రాయితీ అందజేత
- క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్న విద్యుత్ శాఖాధికారులు
- రెండు నియోజకవర్గాల్లో సమావేశాలు



మండపేట మున్సిపాలిటీలో సూర్యఘర్ పథకంపై సమీక్ష సమావేశం (ఫైల్)

కపిలేశ్వరపురం: ఆధునిక జీవన విధానంలో విద్యుత్ నిత్యావసరంగా మారింది. మానవుని కార్యకలాపాలు సజావుగా సాగాలంటే విద్యుత్ సదుపాయం అనివార్యమైంది. ఏపీ ట్రాన్స్‌కో ద్వారా సరఫరా అవుతున్న విద్యుత్ సరఫరా స్థానంలో సోలార్ విద్యుత్ సదుపాయాన్ని వినియోగించుకునే దిశగా ప్రజలు ఆలోచన చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది. అందుకు తగిన కార్యాచరణను ఆశాఖ సిద్ధం చేసింది. ప్రభుత్వం పీఎం సూర్య ఘర్ యోజన పథకానికి రాయితీని ప్రకటించి ప్రజలను చైతన్యవంతం చేస్తోంది.

పథకం ఇలా...

పర్యావరణ పరిరక్షణ ఆలోచనలో భాగంగా సౌర శక్తి నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే విధానాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. అందులో భాగంగా సూర్యఘర్ యోజన పథకాన్ని రూపొందించింది. ఇంటి స్లాబుపై సోలార్ శక్తిని ఉత్పత్తి చేసే ఫలకాలను ఏర్పాటు చేసుకునే వీలును కుదుర్చుకోవడం వినియోగదారుని ప్రధాన పని. అలా ఏర్పాటు చేసుకునే వారికి ప్రభుత్వం రాయితీ ప్రకటించింది. ముందుగా పెట్టుబడి పెట్టిన వారికి కేంద్ర ప్రభుత్వం రాయితీతో పాటు గ్రిడ్‌కు సరఫరా చేసిన విద్యుత్‌తో లెక్క కడితే ఖర్చు చేసిన మొత్తం రెండు ,మూడేళ్ళలో తిరిగి వస్తుందని అధికారులు చెబుతున్నారు. విద్యుత్ వినియోగాన్ని బట్టి సున్నా బిల్లులు లేకా స్వల్ప చార్జీలు వస్తాయి. సౌర విద్యుత్ నెట్ మీటరు ఏర్పాటు చేసుకుని నేరుగా గ్రిడ్‌కు అనుసంధానం చేయడం ద్వారా నెలకు వచ్చే బిల్లులో ఆమేరకు మినహాయింపు ఉంటుంది.

రాయితీ వర్తించేది ఇలా...

మండపేట పట్టణంలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందినవారు సూర్యఘర్ పథకంలో రూఫ్‌టాప్ సోలార్ ఏర్పాటుకు 555 మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. వారిలో 319 మంది అంగీకారం తెలిపారు. ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన వారిలో 21 మందికి 8 మంది అంగీకరించారు. ఇతర సామాజిక వర్గీయుల్లో 861 మంది అంగీకారం తెలపగా ఇప్పటికే 57 మంది సోలార్ ఫలకాలు వేయించుకున్నారు. ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గీయులకు సూర్యఘర్ పథకం దారా సోలార్ విద్యుత్‌ను ఉచితంగా అందజేస్తున్నారు. సొంత స్థలం లేని వారి కోసం పట్టణంలోని మున్సిపాలిటీకి చెందిన ఖాళీ స్థలంలో అధికారుల అనుమతితో సోలార్ ఫలకాలను ఏర్పాటు చేసుకనే అవకాశాలున్నాయి. వాటిని ఏర్పాటు చేసిన అనంతరం గ్రిడ్‌కు అనుసంధానిస్తారు. వీరు ఇప్పటికే రాయితీ పొందితే, దీంతో పాటు గ్రిడ్‌కు సరఫారా చేసిన విద్యుత్ నుంచి కూడా వినహాయింపు ఇస్తారు. రామచంద్రపురం పట్టణంలో 1,730, ఎస్సీ ఎస్టీ సామాజిక వర్గీయులను గుర్తించగా 1,592 మంది రిజిస్ట్రేషన్ పూర్తి చేశారు. వీరిలో 200 మందికి సోలార్ విద్యుత్‌ను ఉచితంగా ఇచ్చేందుకు సిద్ధం చేస్తున్నారు. ఇతరుల్లో 750 మంది రిజిస్ట్రేషన్ చేయిచుకోగా ఇప్పటిక 46 మంది ఏర్పాటు చేసుకున్నారు.

ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు



సూర్యఘర్ పథకంపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. మున్సిపల్ కార్యాలయంలో విద్యుత్ శాఖ అనుబంధ శాఖల అధికారులతో పలు మార్లు సమీక్ష సమావేశాలు సైతం నిర్వహించాం. ప్రకృతి సిద్ధమైన సోలార్ విద్యుత్ వినియోగించేందుకు ప్రజలు అలవాటు చేసుకోవడం మేలు.

– టీవీ రంగారావు, కమిషనర్, మండపేట మున్సిపాలిటీ

సోలార్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఇలా...

ఎంత మేరకు సోలార్ విద్యుత్ వాడకం అవసరం అవుతుందోనన్న అంచనాతో కిలోవాట్ సామర్థ్యం ప్రాతిపదికన ఈ పథకాన్ని అమలు చేస్తారు. ఎంచుకున్న సామర్థ్యం పథకానికి సంబంధించిన మొత్తం ధరను చెల్లించిన తర్వాత కేంద్ర ప్రభుత్వం రాయితీ ఇస్తోంది. వినియోగదారుడు ఈ మొత్తాన్ని బ్యాంకు ద్వారా రుణం పొందే అవకాశం ఉంది. ఒక కిలోవాట్ సామర్థ్యంగల సోలార్ ఫలకాన్ని ఏర్పాటుకు చేసుకునేందుకు రూ.70వేలు ఖర్చు అవుతుంది. దానిలో ప్రభుత్వం రూ.30వేలు రాయితీ ఇస్తుంది. రోజుకు 4 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. 2 కిలోవాట్లకు రూ.1.14 లక్షలు ఖర్చుకాగా, రూ.60 వేలు రాయితీ వస్తుంది. రోజుకు 8 యూనిట్లు సోలార్ విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. 3 కేవీ సోలార్ ఫలకాలకు రూ.2.10 లక్షలు కాగా రూ.78 వేలు రాయితీ వస్తుంది. రోజుకు 12 యూనిట్లు ఉత్పత్తి అవుతుంది.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి



తాగునీటి సమస్యపై పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం సమర్పిస్తున్న సలాది నానాజి, యాళ్ల సూర్యప్రకాశ్

కాజులూరు: స్థానిక శ్రీరామ్‌నగర్, ఏఏ నగర్‌లో తలెత్తిన తాగునీటి సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని స్థానిక నాయకుడు సలాది నానాజీ, మాజీ జెడ్పీటీసీ యాళ్ల సూర్యప్రకాశ్, యాళ్ల సత్తిబాబు తదితరులు కోరారు. శనివారం గ్రామంలో నానాజీ తదితరులు మాట్లాడుతూ గతంలో గ్రామంలోని రక్షిత మంచినీటి పథకం నుంచి ప్రధాన గ్రామంతోపాటు శివారు గ్రామాలైన శ్రీరామ్‌నగర్, ఏఏ నగర్, చాకిరేవు మెరక, అగ్రికుల క్షత్రియుల పేటకు తాగునీరు సరఫరా అయ్యేదని తెలిపారు. గ్రామాల్లోని ప్రజలకు తాగునీటి అవసరాలు పెరగడంతో శివారు గ్రామాలకు నీరు అందేదికాదన్నారు. ముఖ్యంగా శ్రీరామ్‌నగర్, ఏఏ నగర్‌లో తాగునీటి కష్టాలు ఎక్కువయ్యాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో శ్రీరామ్ నగర్, ఏఏ నగర్‌కు జలజీవన్ మిషన్ నిధులతో ప్రత్యేక వాటర్ ట్యాంకు నిర్మించి పైపులైన్లు ఏర్పాటు చేశారని తెలిపారు. ఎన్నికల అనంతరం స్థానిక రాజకీయాల నేపథ్యంలో నూతన ట్యాంకు ప్రారంభోత్సవానికి నోచుకోలేదన్నారు. దీంతో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తప్పటం లేదన్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి ఈశ్వరికి వినతిపత్రం అందించినట్టు తెలిపారు.

బీసీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన



రామనర్సుతోటలో బీసీ కమ్యూనిటీ హాలు శంకుస్థాపనలో పాల్గొన్న ఎంపీ బోస్, పిల్లి సూర్యప్రకాశ్

రామచంద్రపురం రూరల్: వెంకటాయపాలెం శివారు రామనర్సుతోటలో రూ.15 లక్షల ఎంపీ గ్రాంటుతో నిర్మిస్తున్న బీసీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ శనివారం శంకుస్థాపన నిర్వహించారు. సర్పంచ్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు యల్లమిల్లి సతీష్‌కుమారి నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్, ఎంపీపీ అంబటి భవాని, ఏపీ ఐడీసీ మాజీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, మాజీ సర్పంచ్ కొప్పిశెట్టి శ్రీలక్ష్మి, మాజీ ఎంపీటీసీ దడాల రవికుమార్, శెట్టిబలిజ సంఘ పెద్దలు పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం



స్టాల్‌లో పోషకాహారాన్ని ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీలు

కపిలేశ్వరపురం (మండపేట): గర్భిణులు, బాలింతలు మెరుగైన ఆరోగ్యం కోసం పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ మండపేట ప్రాజెక్ట్ సీడీపీఓ పూర్ణిమ అన్నారు. మండపేట మండలం కేశవరంలో శనివారం 8వ రాష్ట్రీయ పోషణ మహోత్సవం నిర్వహించారు. సర్పంచ్ పి.సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్ హాజరయ్యారు. ఐటీసీ ప్రథం జిల్లా కోఆర్డినేటర్ సత్యనారాయణ, ప్రీస్కూల్ ప్రాధాన్యాన్ని వివరించారు. ప్రథం ప్రతినిధులు పావని, సంతోషి, సునీత, నాగవేణి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత, ఎం మాణిక్యం హాజరయ్యారు.

ధర్నాను విజయవంతం చేయండి



సన్నాహక సమావేశంలో పాల్గొన్న నాయకులు

కపిలేశ్వరపురం (మండపేట): ఈ నెల 7న విజయవాడలో ఫ్యాప్టో ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫ్యాప్టో నాయకులు పిలుపునిచ్చారు. మండపేటలో శనివారం నిర్వహించిన ధర్నా సన్నాహక సమావేశంలో నాయకులు పి.సురేంద్ర, కె. వీరరాఘవులు, ఎం. వెంకట్రాజు, కె.గోపాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఐఆర్‌ను ప్రకటించాలని, నాలుగు నెలల డీఏ విడుదల చేయాలని, తదితర డిమాండ్లను పరిష్కరించాలని ధర్నా చేస్తున్నట్టు వారు తెలిపారు.

ఆటో డ్రైవర్లకు అండగా ఉంటాం



రామచంద్రపురంలో ఆటో డ్రైవర్లకు చెక్కు అందిస్తున్న ఎంపీ హరీష్‌మాథూర్



మండపేటలో ఆటో డ్రైవర్లకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

రామచంద్రపురం: కూటమి ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న ఆటో డ్రైవర్ల సేవలో పథకం ప్రారంభోత్సవాన్ని శనివారం రామచంద్రపురంలో నిర్వహించారు. అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాథూర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత రామచంద్రపురం వెల్ల బ్రిడ్జి వద్ద ప్రారంభమైన ఆటోల ర్యాలీలో ఎంపీతోపాటు ఆర్డీవో అఖిల, కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు. లయన్స్ క్లబ్ కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు అండగా ఉంటామని అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కేవీవీఆర్ రాజు, ఎంపీడీవో రాంబాబు, తహసీల్దార్ మృత్యుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం (మండపేట): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నియోజకవర్గం పరిధిలోని 'ఆటో డ్రైవర్ల సేవలో ' పథకం లబ్ధిదారులకు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చేతుల మీదుగా చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నీటి పారుదల సంస్థ ఛైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ, మున్సిపల్ మాజీ ఛైర్మన్ చుండ్రు శ్రీ వరప్రకాష్, మున్సిపల్ కమిషనర్ టీ వీ రంగారావు, రవాణా శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి వెండి కిరీటం సమర్పణ

అమలాపురం టౌన్: పట్టణంలోని కౌండిన్య నగర్‌లోని శ్రీకోదండ రామాలయం వద్ద గల ఆంజనేయ స్వామి విగ్రహానికి దాతలు రూ.1.50 లక్షల విలువైన వెండి కిరీటాన్ని సమర్పించారు. మామిడికుదురు మండలం మగటపల్లికి చెందిన వర్ధినీడి త్రినాథరావు, ఉమామహేశ్వరి దంపతులు రూ.లక్ష, ఆలయ కమిటీ రూ.50 వేలతో స్వామివారికి వెండి కిరీటాన్ని తయారు చేయించి అలంకరించారు.

కనకదుర్గ ప్రతిమల నిమజ్జనం



కోటిపల్లిలో గోదావరిలో నిమజ్జనం చేసేందుకు చివరి పూజ చేస్తున్న అముజూరు భక్తులు



వెదురుపాకలో దుర్గాదేవి అమ్మవారు



ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో పూర్ణాహుతి కార్యక్రమం

కె.గంగవరం: శరన్నవరాత్ర మహోత్సవాల అనంతరం కనకదుర్గ అమ్మవారి విగ్రహాలను గౌతమి గోదావరిలో నిమజ్జనం చేసేందుకు భక్తులు పోటీ పడుతున్నారు. మండల పరిధిలోని కోటిపల్లి వద్ద గోదావరి నదిలో పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలను శనివారం నిమజ్జనం చేశారు. నిమజ్జనానికి ముందు పుష్కర ఘాట్ వద్ద మహిళలు, యువకులు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆయా గ్రామాల్లో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఇటీవల గోదావరి ఉధృతంగా ప్రవహించి కొంత మేర తగ్గడంతో పుష్కర ఘాట్లు బురదమయంగా మారడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు.

భీమేశ్వరాలయంలో పూర్ణాహుతి

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న 12వ శక్తి పీఠం ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారి సన్నిధిలో నిర్వహించిన దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయ ఈఓ, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ అల్లు వెంకటదుర్గాభవాని ఆధ్వర్యంలో శనివారం పూర్ణాహుతి కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ హోమశాలతో అర్చకులు, వైదిక బృందం వేద మంత్రోచ్చారణతో పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా అమ్మవారి నిమజ్జనం

రాయవరం: వెదురుపాక దేవీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మండపంలో శరన్నవరాత్ర ఉత్సవాలు శనివారం ముగిసాయి. ఈ సందర్భంగా నిమజ్జనం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు చేసి అనంతరం అమ్మవారి విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం అమ్మవారి నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బియ్యం షాపులో పనిచేస్తూ డీఎస్సీలో ప్రతిభ

ఒడుదొడుకులు ఎదుర్కొని రాంబాబు లక్ష్య సాధన



ఉపాధ్యాయ కొలువు సాధించిన రాంబాబును సత్కరిస్తున్న యువకులు

కపిలేశ్వరపురం: పేదరికం వెంటాడినా పట్టుదలతో కృషి చేస్తే విజయం తప్పక వరిస్తుందని నిరూపించాడు మండపేట మండలం ఏడిద గ్రామానికి చెందిన డీఎస్సీ విజేత రాంబాబు. వ్యవసాయ కూలి నేపథ్యం గల తల్లిదండ్రులకు భారం కాకుండా రాంబాబు తన చదువును కొనసాగించాడు. కష్టాలను అధిగమించేందుకు ఉపాధ్యాయ ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా నిర్దేశించుకుని మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలైనప్పుడు పరీక్షకు సిద్ధమయ్యాడు. గతంలో పలుమార్లు అపజయాలు ఎదురైనా మొక్కవోని దీక్షతో విజయం వైపు తన పయనం సాగించి విజేతగా నిలిచాడు. అమ్మానాన్నలు సంగయ్య, సుజనమ్మ సుమారు 50 ఏళ్ల క్రితం బొబ్బిలి నుంచి ఉపాధి కోసం మండపేట వచ్చి ఏడిద గ్రామంలో స్థిరపడ్డారు. 40 ఏళ్ల క్రితం ప్రభుత్వ కాలనీలో కట్టుకున్న పెంకుటింటిలోనే ఇప్పటికీ రాంబాబు ఉంటున్నాడు. కడియం మండలం మురమండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్, మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ, శ్రీకాకుళంలోని పీజీ కళాశాలలో ఎంఏ పూర్తి చేసాడు. మచిలీపట్నం నేషనల్ కళాశాలలో బీఈడీ చదివాడు. ఆయన చదువులకు పలువురు ఆర్థిక సాయం అందజేశారు.

ఆఖరి అవకాశాన్ని అందిపుచ్చుకుని..

రాంబాబు ఆలయమూరు మండలంలోని ప్రైవేటు బియ్యం షాపులో పని చేస్తున్నాడు. వయస్సు రీత్యా ఆఖరి అవకాశం కావడంతో ప్రస్తుత డీఎస్సీలో విజయం కోసం శక్తి వంచన లేకుండా ఇంటి వద్దే శ్రమించాడు. 2008 డీఎస్సీ తొలి ప్రయత్నంలోనే ఎంపికైనప్పటికీ కోర్టు తీర్పుతో ఉపాధ్యాయ కొలువుకు దూరమయ్యాడు. 2012 డీఎస్సీ పరీక్షలకు సిద్ధమవుతుండగా తల్లి సుజనమ్మ అనారోగ్యానికి గురై మరణించడంతో కుంగిపోయాడు. 2018 డీఎస్సీకి సిద్ధమవుతుండగా తండ్రి సంగయ్య ప్రమాదంలో కాలు విరగడంతో ఆయనకు సపర్యలు చేసే క్రమంలో చదువుకు ఆటంకమైంది. కరోనా సమయంలో తండ్రి సంగయ్య, అక్క బొత్సా లక్ష్మి, సోదరుడు రమేష్ రెండు వారాల వ్యవధిలోనే మృతి చెందడంతో ఒంటరివాడయ్యాడు. మరో సోదరి రాజాన సుందరమ్మ ఏడిదలో ఉంటూ రాంబాబుకు వండి పెడుతున్నారు. ప్రస్తుత డీఎస్సీలో ఎస్సీ కేటగిరీలో స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. స్కూల్ అసిస్టెంట్ సోషల్ ఉద్యోగాన్ని ఎంచుకున్నట్టు రాంబాబు తెలిపాడు.

ఖరీఫ్ ఆశలు ఆవిరి

- ఖరీఫ్ దిగుబడిపై రైతుల వర్రీ
- నీటి పాలవుతున్న పంటలు
- వృథా అవుతున్న పెట్టుబడులు
- అన్నదాతలపై అప్పుల భారం
- ఆదుకోని కూటమి ప్రభుత్వం



భీమనపల్లిలో కలువ పువ్వులతో నిండిన వరి చేను

ఉప్పలగుప్తం: ప్రస్తుతం వ్యవసాయమే జీవనాధారంగా నమ్ముకుని వరి సాగు చేస్తున్న అన్నదాత ప్రకృతి సహకరించక పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా వరి సాగు చేస్తున్న రైతన్నకు ఏటా ఆటు పోట్లు ఎదురవుతూనే ఉన్నాయి. కష్టాన్ని నమ్ముకుని ఖరీఫ్ సాగు చేసిన కర్షకులు అడుగడుగునా అడ్డంకులతో అవస్థలు పడుతున్నారు. వ్యవసాయం గట్టెక్కిస్తుందని నమ్మి అప్పులు తెచ్చి సాగు చేస్తున్న రైతుకు తిప్పలు తప్పటంలేదు. కొన్నేళ్లుగా ముంపు భయంతో ఖరీఫ్ సాగుకు పంట విరామం ప్రకటిద్దాం అనుకున్న రైతులకు ప్రభుత్వం ఒత్తిడితో సాగు చేపట్టక తప్పలేదు.

భారీ వర్షాలు, వరదలతో నష్టాలు

దుక్కి దున్ని, నారుపోసి, నాట్లు నాటి ఖరీఫ్ సాగు చేపట్టిన రైతులకు ఆరంభం నుంచి పరిస్థితి అవస్థలమయంగా మారింది. దీనికి కారణం రెండు నెలలుగా కురిసిన భారీ వర్షాలకుతోడు ఎగువ ప్రాంతాల నుంచి నీరు పోటెత్తడంతో గోదావరికి ఐదు సార్లు వచ్చిన వరదల కారణంగా పంట పొలాలన్నీ జలమయమయ్యాయి. మైనర్, మేజర్, మీడియం డ్రెయిన్లలో నీరు వరిచేల కంటే ఎగువ ప్రాంతాల్లో ఉండటంతో ముంపు దిగక కొన్నిచోట్ల చేలు కుళ్లిపోయి, మరికొన్ని చోట్ల దుబ్బు చేయని పరిస్థితిల్లో కనిపిస్తున్నాయి. వరి దుబ్బు పలుచబడి కలువ పువ్వు విస్తరించి వరి పంట కలువల పంటగా దర్శనమిస్తోంది. దీనితో వ్యవసాయమే ఆధారంగా బతుకుతున్న రైతులు కొందరు విసుగు చెంది పంటల సాగుకు దూరమవుతున్నారు.

1,200 ఎకరాల్లో వరి పంటకు నష్టం

అమలాపురం నియోజకవర్గంలో అల్లవరం, ఉప్పలగుప్తం, అమలాపురం మండలాల్లో 11,570 ఎకరాల్లో రైతులు ఖరీఫ్ సాగు చేపట్టారు. నెల రోజుల క్రితం కురిసిన వర్షాలకు డ్రెయిన్లు దిగక దాదాపుగా 1,200 ఎకరాల్లో వరిసాగు ముంపునకు గురయ్యింది. కొన్ని చోట్ల ఇంజన్ల సహాయంతో ముంపు నీటిని బయటకు తోడుతున్నా ఎటువంటి ప్రయోజనం కనిపించడం లేదని రైతులు అంటున్నారు. తరచూ పంటలు ముంపు బారిన పడుతుండటంతో సాగును ముందుకు ఎలా సాగించాలో తెలియక రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ముంపు నీరు డ్రెయిన్ల ద్వారా దిగకపోవటంతో వరి దుబ్బులు కుళ్లిపోయే పరిస్థితి కొన్ని ప్రాంతాల్లో నెలకొంది. గతంలో ఖరీఫ్ వరి సాగు చేసిన రైతుకు 30 నుంచి 35 బస్తాల ధాన్యం దిగుబడి వచ్చేది. దీనితో పండించిన పంటకు గిట్టుబాటు కలిగి పెట్టుబడులు చేతికొచ్చేవి. ఈ సంవత్సరం వరిసాగు చేసిన రైతులకు కొన్నిచోట్ల కనీసం 5 నుంచి 15 బస్తాల దిగుబడి వచ్చే పరిస్థితి నెలకొంది. మరికొన్ని చోట్ల వరి చేను పూర్తిగా కుళ్లిపోయి కనీసం పశువుల మేతకూ ఉపయోగపడేలా లేదని రైతన్నలు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికే వరి సాగు చేసిన రైతులు దాదాపు రూ.15 వేల వరకూ పెట్టుబడి పెట్టారు. పంట పూర్తిగా పండితే పెట్టుబడి వ్యయం అయినా చేతికొస్తుందని, మధ్యలోనే ఆటంకాలు కలగడంతో దిగుబడిపై ఆశలు వదులుకున్నామని రైతులు వాపోతున్నారు.